


EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
16-01-2026
పేజీలు: 02







# చంద్రబాబు హింసా రాజకీయాలు

## మూల్యం చెల్లించక తప్పదని వైఎస్ జగన్ హెచ్చరిక



ఏపీలోని గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త, దళితుడు మందా సాల్మన్ హత్యకు గురయ్యాడు. ఈ ఘటనను వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండిస్తూ ట్వీట్ చేశారు. రాజకీయ కక్షలతో ఇంకా ఎంతమంది ప్రాణాలను బలితీసుకుంటారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉండి కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం, పొలిటికల్ గవర్నెన్స్ ముసుగులో ఇన్ని అరాచకాలకు పాల్పడతారా అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. హింసారాజకీయాలకు పాల్పడుతున్న చంద్రబాబును ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించరని, ఇలాంటి ఘటనలకు మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూడ్డానికి సాల్మన్ సొంత గ్రామానికి వెళ్తే ఇనుప రాడ్లతో కొట్టి దారుణ హత్యచేసి, సాల్మన్‌పైనే తప్పడు ఫిర్యాదు చేయడం దారుణమని అన్నారు. ఇలాంటి దారుణాలు చేయడానికా మీరు అధికారంలోకి వచ్చిందా అంటూ మండిపడాడరు. ఈ ఘటన ముమ్మాటికీ వైయస్సార్‌సీపీని భయపెట్టడానికి, కట్టడిచేయడానికి మీరు, మీ పార్టీవారి ద్వారా, కొంతమంది పోలీసులు ద్వారా చేస్తున్న చేయిస్తున్న రాజకీయ హింసాత్మక దాడుల పరంపరలో భాగమేనని ఆరోపించారు. ఎమ్మెల్యే, పోలీసుల బెదిరింపులతో పిన్నెల్లి గ్రామం నుంచి వందలకొద్దీ వైయస్సార్ కార్యకర్తల కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని వెల్లడించారు. పౌరులకు రక్షణ కల్పించడం, వారు స్వేచ్ఛగా తమ జీవితాలను గడిపేలా చూడ్డం మీ బాధ్యత కాదా? అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రిగా ఉండి రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏది విత్తుతారో అదే రేపు పండుతుందన్నది ఎప్పుడూ మరిచిపోకూడదు. టీడీపీవారి చేతిలో హత్యకు గురైన సాల్మన్ కుటుంబానికి వైయస్సార్‌సీపీ అండగా ఉంటూ ఆదుకుంటుందని అన్నారు.




## స్పోర్ట్స్ హాస్టల్‌లో ఇద్దరు మైనర్ అమ్మాయిలు ఆత్మహత్య

కేరళలో ఇద్దరు మైనర్ అమ్మాయిలు ఆత్మహత్య చేసుకున్నారు. కొల్లాంలో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్ రూమ్‌లో వాళ్లు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం ఈ ఘటన జరిగింది. ఆ టీనేజ్ అథ్లెట్లు శాయ్ హాస్టల్‌లో శిక్షణ పొందుతున్నారు. ఒకరు కోచికోడ్, మరొకరు తిరువనంతపురంకు చెందినవారు. ఓ అమ్మాయి 12వ తరగతి చదువుతున్నది. ఆమె అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతోంది. మరో అమ్మాయి 10వ తరగతి చదువుతోంది. ఆమె కబడ్డీలో శిక్షణ పొందుతున్నది. తెల్లవారుజామున 5 గంటల ఆ ఇద్దరు అమ్మాయిలు మరణించిన వార్త బయటకు వచ్చింది. మార్నింగ్ ట్రైనింగ్ సెషన్‌కు రాకపోవడంతో వారి గురించి ఆరా తీశారు. రూమ్ డోరు ఎంతకీ తెరువకపోవడంతో.. హాస్టల్ అధికారులు డోర్‌ను ఓపెన్ చేశారు. సీలింగ్ ఫ్యాన్‌కు ఇద్దరు ఉరి వేసుకున్నారు. కొల్లాం ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకున్నారో తెలియడం లేదు. ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపడుతున్నట్లు కొల్లామ్ సిటీ పోలీసు కమీషనర్ కిరణ్ నారాయణన్ తెలిపారు. రూమ్‌లో ఎటువంటి సూసైడ్ నోట్ కూడా దొరకలేదు.



## విజయవాడ - హైదరాబాద్‌పై ట్రాఫిక్ మళ్లింపులు!

సంక్రాంతి పండుగ ముగియడంతో సొంతూళ్ల నుంచి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లే ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని, హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున, ట్రాఫిక్‌ను మళ్లించినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

**దారి మళ్లింపు వివరాలు :**

1) గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు :
గుంటూరు → మిర్యాలగూడ → హాలియా → కొండమల్లేపల్లి → చింతపల్లి — మాల్ మీదుగా హైదరాబాద్.

2) మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు :
మాచర్ల → నాగార్జునసాగర్ → పెద్దవూర → కొండపల్లేపల్లి — చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్.

3) నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు :
నల్లగొండ — మార్రిగూడ బై పాస్ -మునుగోడు → నారాయణపూర్- చౌటుప్పల్ (ఎన్.హెచ్ 65) మీదుగా హైదరాబాద్.

4.) విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు..
కోదాడ-హుజూర్‌నగర్-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్.


## శబరిమలకు వెళ్లొస్తుండగా యాక్సిడెంట్.. కన్యాకుమారిలో తెలంగాణ దంపతులు దుర్మరణం

తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### మాంజా నుంచి తప్పించుకోబోయి..

## ఒకే ఫ్యామిలీలో ముగ్గురు మృతి

మకర సంక్రాంతి పండుగ వేళ విషాదం నెలకొంది. మాంజా నుంచి తప్పించుకోబోయి ఒకే ఫ్యామిలీకి చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. గుజరాత్‌లోని సూరత్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. సూరత్‌కు చెందిన రెహాన్ రహీమ్ షేక్ (35) తన భార్య రెహానా, పదేళ్ల కుమార్తె ఆయేషాతో కలిసి బుధవారం తన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. అతను చంద్రశేఖర్ ఆజాద్ ఫ్లైఓవర్ వద్దకు రాగానే ఆకస్మాత్తుగా ఒక పతంగి దారం ( మాంజా ) వారికి అడ్డుగా వచ్చి బైక్‌కు చుట్టుకుంది. దాన్ని చేతితో తొలగించే క్రమంలో అదుపుతప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టి, 70 అడుగుల ఎత్తు ఉన్న ఆ ఫ్లైఓవర్ నుంచి కిందపడిపోయారు. కింద నిలిపి ఉన్న ఓ ఆటోరిక్షాపై వారు పడ్డారు. ఈ ప్రమాదంలో రెహాన్, ఆయేషా అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రగాయాలైన రెహానాను హుటాహుటిన సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం రాత్రి రెహానా కూడా కన్నుమూసింది.



ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ప్రజలు గాలిపటాల మాంజాతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిషేధిత చైనా మాంజాను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


### మార్కెట్లో నకిలీ కరాచీ మెహందీలు..

## రూ. 8 లక్షల విలువైన కోన్లు స్వాధీనం

హైదరాబాద్ నగరంలో నకిలీ మెహందీ కోన్ల తయారీ, విక్రయాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. జనవరి 13వ తేదీ మంగళవారం నాడు హైదరాబాద్‌లోని మినార్ కాలనీ, బాలాపూర్ , అఫ్జల్‌గంజ్ ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రముఖ బ్రాండ్ అయిన 'కరాచీ మెహందీ' పేరుతో నకిలీ కోన్లను తయారు చేసి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో మొహమ్మద్ ఆసిఫ్ (తయారీదారు), దీపక్ కుమార్ (హోల్‌సేల్ వ్యాపారి) ఉన్నారు. వీరి నుంచి సుమారు 8 లక్షల రూపాయల విలువైన నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడైన ఆసిఫ్ వృత్తిరీత్యా వడ్రంగి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో మెహందీ తయారీని ప్రారంభించాడు. మొదట్లో ఏ బ్రాండ్ పేరు లేకుండా సాధారణంగా అమ్మేవాడు. అయితే ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో.. మార్కెట్‌లో మంచి ఆదరణ ఉన్న 'కరాచీ మెహందీ' పేరును వాడుకోవడం మొదలుపెట్టాడు. నకిలీ ప్యాకింగ్‌తో వీటిని అసలు వస్తువులుగా నమ్మించి ప్రజలను మోసం చేశారు.

ఈ దాడుల్లో పోలీసులు మెహందీ పొడిలో కలిపేందుకు సిద్ధంగా ఉంచిన 5 కిలోల ఆక్సాలిక్ యాసిడ్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. సాధారణంగా మెహందీ కోన్లు త్వరగా పండటానికి, గాఢమైన రంగు రావడం కోసం ఇలాంటి ప్రమాదకరమైన రసాయనాలను వాడుతుంటారు. నకిలీ మెహందీ వాడటం వల్ల చర్మంపై దద్దుర్లు, దురద, ఎర్రగా కందిపోవడం వంటి సమస్యలు వస్తాయి. యాసిడ్ వంటి రసాయనాల వల్ల చర్మం కాలిపోయి శాశ్వత మచ్చలు పడే అవకాశం ఉంటుంది. కొంతమందికి ఈ రసాయనాల వల్ల శ్వాసకోస ఇబ్బందులు లేదా తీవ్రమైన అలెర్జీలు రావచ్చు.

అసలు బ్రాండ్ ధర కంటే చాలా తక్కువ ధరకే వస్తుంటే అది నకిలీ అయ్యే అవకాశం ఉండే అవకాశం ఉందని.. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. అంతే కాకుండా.. బ్రాండ్ లోగో, స్పెల్లింగ్ తప్పులు, ప్యాకింగ్ నాణ్యతను గమనించాలన్నారు. ఘటైన రసాయన వాసన వస్తుంటే అటువంటి కోన్లను వాడకపోవడమే మంచిదని పేర్కొన్నారు. లాభార్జనే ధ్యేయంగా ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే ఇలాంటి ముఠాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



## ఏపీ, తెలంగాణ జల వివాదాలపై కమిటీ.. ఈ నెల 30వ తేదీన తొలి భేటీ



ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటైన కమిటీ తొలి సమావేశం తేదీ ఖరారైంది. ఈ నెల 30వ తేదీన ఢిల్లీలోని సేవా భవన్‌లో మధ్యాహ్నం 30 గంటలకు ఈ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రాజెక్టు అప్రైజల్ ఆర్గనైజేషన్ (పీఏవో), సీడబ్ల్యూసీ సమావేశ నోటీసును జారీ చేసింది. పోలవరం — నల్లమలసాగర్ ప్రాజెక్టు సహా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య జల నిర్వహణకు సంబంధించిన ప్రధాన సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు, కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు నుంచి అవసరమైన సమాచారాన్ని సేకరించనున్నారు. అవసరమైతే నిపుణులు, సీనియర్ ఇంజినీర్లను కమిటీకి సహాయకులుగా నియమించడం, ఇతరత్రా అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తి సమాచారం, నివేదికలతో హాజరుకావాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య జల వివాదాల పరిష్కారానికి 15 మంది అధికారులతో జనవరి 2వ తేదీన కేంద్రం ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర జల్‌శక్తి శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.



తెరపై గ్లామర్ ఒలకబోయడం వేరు.. జీవితం పట్ల స్పష్టమైన అవగాహన ఉండటం వేరు. జబల్‌పూర్ గల్లీల నుంచి వెండితెర మెరుపుల వరకు షాలినీ పాండే సాగించిన ప్రయాణం ఒక నిరంతర పాఠం. 'అర్జున్‌రెడ్డి'లో అమాయకపు ప్రీతిగా మెప్పించిన ఈ భామ ఇప్పుడు 32 ఏళ్ల వయసులో మరింత పరిణితితో మాట్లాడుతోంది. 2026లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న షాలిని.. తన కెరీర్, ఫిట్‌నెస్, నెపోటిజంపై తన అభిప్రాయాలను కుండ బద్దలుగొట్టినట్టు చెప్పింది. గతేడాది తనకు నేర్పిన అతిపెద్ద పాఠం గురించి షాలిని చెబుతూ... "జీవితం పరిపూర్ణంగా ఉండాల్సిన అవసరం లేదు. కానీ మనం చేసే పనిలో సార్థకత ఉంటే చాలు" అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేతిలో 'రాహు కేతు' వంటి క్రేజీ ప్రాజెక్టుతోపాటు 'బంద్‌వాలే' అనే వెబ్ సిరీస్ కూడా ఉంది.

# వయసు పెరగడం ఒక వరం

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# సంక్రాంతి స్పెషల్ మూవీ పోస్టర్స్ 2026

